క్లుప్తంగా

వైస్ ఎంపీపీకి ఎంపీపీ పరామర్శ



వైస్ ఎంపీపీని పరామర్శిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, నాయకులు

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండల వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్యను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వైస్ ఎంపీపీని తన స్వగ్రామమైన పులికొండలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు జరిగిన శస్త్ర చికిత్స గురించి తెలుసుకుని పరామర్శించారు. సర్పంచ్ మక్కెన రాజేంద్ర కుమార్, రావి వెంకటేశ్వర్లు, రావి యలమంద, మాజీ సర్పంచ్ బక్కముంతల గంగిరాజు, సాదినేని వెంకటరావు, కుంచాల బ్రహ్మయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఒంగోలు టౌన్: భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. ఉద్యోగం రావడం కంటే కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉద్యోగంలో రాణించడమే చాలా ముఖ్యమని అన్నారు. విజయవాడకు చెందిన పీవీఎస్ఆర్ గ్రూపు ఇటీవల యర్రగొండపాలెంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారికి ప్రైవేటు కంపెనీలు అధిక జీతాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీవీఎస్ఆర్ గ్రూపు సీఈఓ పి.గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి గాయపడిన వ్యక్తి మృతి

మద్దిపాడు: గోడ కూలి గాయాలపాలైన వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఎస్సై శివరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో ఎనిమిది రోజుల క్రితం గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లి అక్కడున్న అరుగుపై కొందరు కూర్చున్నారు. ఆ అరుగును ఆనుకుని ఉన్న పాత గోడ కూలి వారిపై పడింది. వారిలో ముచ్చు ఆంజనేయులు (63), చిట్టిబోయిన సుబ్బారావు గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ముచ్చు ఆంజనేయులు పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మద్దిపాడు ఎస్సై శివరామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొరియర్ సర్వీసు మేనేజర్ అదృశ్యం

ఒంగోలు టౌన్: ఒక ప్రైవేటు కొరియర్ సర్వీసులో పనిచేస్తున్న మేనేజర్ కనిపించడం లేదని సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బద్వేలు జిల్లా వెంకటశెట్టిపల్లి గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్రరెడ్డి (32) గత 18 నెలలుగా నగరంలోని ఒక ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీసులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అవివాహితుడైన ఆయన అదే కొరియర్ ఆఫీసు పైగదిలో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆఫీసుకు రాకపోవడంతో పైగదిలోకి వెళ్లి చూసిన సిబ్బందికి గదికి తాళం వేసి ఉండటం కనిపించింది. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. సాయంత్రం వరకు ఎదురు చూసినా అతడి జాడ లేకపోవడంతో కొరియర్ సిబ్బంది ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల బరితెగింపు

- ఏసీబీ డీఎస్పీ పేరుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి డబ్బు వసూలు

ఒంగోలు టౌన్: సైబర్ నేరగాళ్లు బరితెగించారు. ఏకంగా ఏసీబీ డీఎస్పీ పేరుతో ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను బెదిరించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న ఒక కానిస్టేబుల్‌ను బెదిరించిన సైబర్ నేరగాళ్లు.. 1.5 లక్షల రూపాయలు వసూలు చేశారు. ఏసీబీ డీఎస్పీగా చెప్పుకుంటూ ఫోన్ చేసిన నేరగాళ్లు భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు సమాచారం. దాంతో తొలి విడతగా లక్ష రూపాయలు, రెండో విడత 50 వేల రూపాయలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు తెలుస్తోంది. తీరిగ్గా విచారించగా, బెంగళూరుకు చెందిన కొందరు సైబర్ నేరగాళ్లు పక్కా ప్లాన్‌తో డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. దాంతో మోసానికి గురైనట్లు తెలుసుకున్న కానిస్టేబుల్.. స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదు.

ఆధార్ కోసం అష్టకష్టాలు

- గంటల తరబడి కాదు.. రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి
- అధికంగా నగదు వసూళ్లు



గాలి, వెలుతురు, కుర్చీలు కూడా లేని ఒంగోలు హెడ్ పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న ప్రజలు

ఒంగోలు వన్‌టౌన్: ప్రస్తుతం మన దేశంలోని ప్రతి పౌరుడికీ అన్నింటికీ ఆధారం ఏదైనా ఉందంటే అది ఆధార్ కార్డు మాత్రమే. ప్రభుత్వ పథకాలు అందాలన్నా, విద్యార్థులు స్కూళ్లు, కళాశాలల్లో ప్రవేశాలు పొందాలన్నా, సిమ్ కార్డులు తీసుకోవాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి పనికీ ప్రాథమికంగా కావాల్సిన ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేయించుకోవాలన్నా, చిన్నారులకు నూతనంగా ఆధార్ కార్డు తీసుకోవాలన్నా, బయోమెట్రిక్‌లు నమోదు చేయాలన్నా, ఫోన్ నంబర్ మార్చుకోవాలన్నా తప్పనిసరిగా ఆధార్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకునేందుకు, నూతనంగా పొందేందుకు ఆధార్ కేంద్రాల వద్ద గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి. కానీ, ఆయా కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో పాటు రోజంతా వేచి ఉండాల్సి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రంలో కింద కూర్చోవాల్సిందే...

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒంగోలులోని మెయిన్ పోస్టల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం వద్ద కనీస వసతులు కూడా లేవు. అక్కడకు వచ్చిన వారు కిందే కూర్చోవాల్సిన పరిస్థితి. టోకెన్ కోసం క్యూలైన్‌లో నిలబడటం ఒక ఎత్తయితే.. ఆధార్ నమోదు చేయించుకోవడం మరో ఎత్తు. రోజుకు 30 నుంచి 40 టోకెన్లు మాత్రమే ఇస్తున్నప్పటికీ.. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అనంతరం సమయం ఉంటే మరికొంతమందికి కూడా ఆధార్ నమోదు చేస్తుండటంతో ఆశావహులు రోజంతా ఎదురుచూస్తూ అక్కడే ఉంటున్నారు. గుంపుగా ఉంటుండటం వలన ఇక్కడ తరచూ వాగ్వాదాలు, తోపులాటలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో ఉక్కపోత వాతావరణంలో వేచి ఉండలేక ప్రజలు అవస్థపడుతున్నారు. ఆధార్ నమోదు కోసం వచ్చిన వారికి కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయడం లేదు. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రజల నుంచి సర్వీస్ పేరుతో రుసుం వసూలు చేస్తున్న ప్రభుత్వం .. కనీసం కూర్చోవడానికి కుర్చీలుగానీ, తాగడానికి మంచినీరుగానీ అక్కడ ఏర్పాటు చేయడం లేదు. ఆధార్ కేంద్రంలో సరైన గాలి, వెలుతురు కూడా లేదు. కేవలం ఫొటో దిగడానికి మాత్రమే అవసరమైన సమయంలో టేబుల్ లైట్ వేసి ఆపివేస్తుండటం, చీకటితో పాటు తీవ్రమైన ఉక్కపోత ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టారాజ్యంగా నగదు వసూలు...

ఆధార్ సెంటర్‌లోని సిబ్బంది వారికి ఇష్టం వచ్చినట్లుగా ప్రజల నుంచి నగదు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అప్‌డేట్ కోసం రూ.100, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ కోసం రూ.50, కలర్ ప్రింట్‌కు రూ.30 చొప్పున వసూలు చేయాల్సి ఉండగా, అమాయకుల నుంచి రూ.200 నుంచి రూ.500 వరకూ వసూలు చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. గతంలో కూడా ఇటువంటి ఆరోపణలు రావడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని మార్చి కొత్తవారిని నియమించారు. అయినప్పటికీ ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. అదనంగా నగదు వసూలు చేస్తూనే ఉన్నారు.

9న గుమ్మలంపాడు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లు



పూజలందుకుంటున్న ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు సమీపంలో గల నిధి వద్ద ఈ నెల 9వ తేదీ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 60వ వార్షిక తిరునాళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అర్చకుడు అన్నావఝల శ్రీనివాసమూర్తి, శాండిల్య శర్మ, తదితరుల ఆధ్వర్యంలో స్వామివారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త బొడ్డపాటి రమణారావు పర్యవేక్షిస్తున్నారు. తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు పొంగళ్లు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఎడ్ల బండ్లతో కూడా రైతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి, మద్దిపూడి, చీమకుర్తి, పొదిలి, టంగుటూరు తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరునాళ్లకు వస్తుంటారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, తదితరులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

బౌద్ధ భిక్షువులచే విశ్వశాంతి మహాహోమం



మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు

ఒంగోలు మెట్రో: స్థానిక అన్నవరపాడులోని శివం శరణాలయాన్ని సోమవారం బౌద్ధ భిక్షువులు సందర్శించారు. జపాన్‌కు చెందిన యుషీ షావోలిన్, శ్రీలంకకు చెందిన బౌద్ధ హీన్‌లకు శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహా రుద్రాభిషేకం, విశ్వశాంతి కళ్యాణం నిర్వహించగా, బౌద్ధ భిక్షువులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం గోమాతలను శరణాలయానికి దానమిచ్చారు. సకల జనుల శ్రేయస్సుకై ఏకాదశ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు వైద్యం, జీవనోపాధి కోసం 40 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. బాపట్ల ఆదిలక్ష్మికి రూ.20 వేలు, ఉదరగుడి ఈశ్వరమ్మకు రూ.5 వేలు, పునమిల్లి పురందేశ్వరికి రూ.10 వేలు, పెద్దినేని రమణకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బౌద్ధ భిక్షువులను శరణాలయం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విశ్వశాంతి కోసం హోమం నిర్వహించడం, కులం, మతం భేదం లేకుండా నిరుపేదలకు సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానవత సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, రాజేశ్వరి, నాగరాజు, సురేష్, తిరుమల సులోచన, ప్రసన్నకుమారి, రాజ్యలక్ష్మి, కావ్య, వెంకటరత్నం, సుబ్బులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులతో దుంపా చెంచిరెడ్డి, శివరామయ్య

సంతనూతలపాడు: మండలంలోని గుమ్మలంపాడు నిధి వద్ద ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 60వ వార్షిక తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ గుమ్మలంపాడు నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేశారు. స్థానిక ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ గుమ్మలంపాడు గ్రామ అధ్యక్షుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొక్కిసం శివరామయ్య అధ్వర్యంలో స్థానిక నాయకుల సహకారంతో ఏర్పాటు చేయనున్న ప్రభపై నిర్వహించే కార్యక్రమాలలో మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలయ అర్చకులు ఏ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, సర్పంచ్ షేక్ పాత్యాసాహెబ్, ఎంపీటీసీ ఎల్.నాగేశ్వరరావు, గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డపాటి శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, బి.ఆంజనేయులు, మంగపాటి శ్రీనివాసరావు, బి.బ్రహ్మయ్య, నల్లూరి భాస్కరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, గుమ్మలంపాడు, ఎనికపాడు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం



పూజలందుకుంటున్న సీతారామస్వామివారు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీరామనవమి, సీతారాముల కళ్యాణం జరిగిన మరుసటి రోజైన సోమవారం ఒంగోలు నగరంలోని రామాలయాల్లో రాములోరికి శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక గడియారంవారివీధిలోని అనంత కోదండరామస్వామి ఆలయంలో ఒంగోలు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకస్వామి రాములవారి అష్టోత్తర శతనామావళి పూజ, హారతి, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. రాత్రి ఏడు గంటలకు చక్కగా అలంకరించిన వేదికపై సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లను చక్కని వస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేద పురోహితులు ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించిన అనంతరం శ్రీరామ పట్టాభిషేకాన్ని నయన మనోహరంగా జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జెడ్పీకాలనీలో...

ఒంగోలు మంగమూరు రోడ్డులోని జెడ్పీ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజుశివ శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు, శ్యాంప్రసాద్

ఒంగోలు సిటీ: ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా జీవం ఉన్న ప్రతి జీవికి నిరంతరం పట్టెడన్నం అందించేందుకు నేటి కంప్యూటర్ యుగంలో సైతం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత సామాజిక సామరస్యత వేదిక కన్వీనర్ శ్యాం ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సమావేశపు హాలులో ‘వ్యవసాయం అభివృద్ధికి రైతులు, రైతు కూలీల సమైక్యతలో గల ఆవశ్యకత’ అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీవీఎస్‌పీఎం డిగ్రీ కళాశాల అధినేత బి.సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం పట్ల రైతుల్లో చైతన్యం తీసుకురావాలని, అదే సమయంలో పశుపోషణ, పశు సంపదను వృద్ధిచేసుకుంటూ గేదెలను, గోమాతలను పెంచుతూ సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా గణనీయమైన వ్యవసాయ ఉత్పత్తులు పొందడంతో పాటు ఆరోగ్యవంతమైన వ్యవసాయ ఉత్పత్తులు పొందవచ్చని అన్నారు. దేశంలో ఆహార ధాన్యాలకు ఎటువంటి కొరత లేకుండా ఆహార భాండాగారంగా భారతావని విరాజిల్లేందుకు అటు రైతులు, ఇటు రైతు కూలీలు సమష్టిగా పనిచేస్తూ నిర్దేశించుకున్న వ్యవసాయ ఉత్పత్తులను పొందడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

ఆంధ్రకేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయినటువంటి రైతే రాజు అని, రైతుకు గిట్టుబాటు ధర లేని కారణంగా, చీడ పీడల కారణంగా ఫలసాయం తగ్గడం వల్ల ఆర్థికపరమైన ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికముక్కు సుబ్బయ్య మాట్లాడుతూ మారిన కాలానికి అనుగుణంగా వ్యక్తుల ఆలోచనలు, అభిప్రాయాలలో సైతం మార్పులు రావాలని, రైతు సోదరులు రైతు కూలీలతో స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉంటూ గణనీయమైన వ్యవసాయ ఉత్పత్తులు పొందడంతో పాటుగా ఆశించిన మేరకు ఫలసాయాన్ని కూడా పొందవచ్చని అన్నారు. నేటి కాలంలో కుటుంబ వ్యవస్థలో సమూలమైన మార్పులు రావడంతో భూస్వామ్య వ్యవస్థ తగ్గిపోవడం, పెద్ద రైతులు సైతం వ్యవసాయం పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించకపోవడం వల్ల చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరి ప్రాంతంలో వ్యవసాయానికి ఆమోదయోగ్యమైన భూములు ఉన్నప్పటికీ సాగునీటి కొరత కారణంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎక్కువ భాగం మెట్ట పైర్లను మాత్రమే సాగుచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన నిర్వహించాలి

ఒంగోలు వన్‌టౌన్: బీసీ కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా సోమవారం ఆవిష్కరించారు. మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి రోజు నుంచి బీసీ కుల గణన నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బొట్ల సుబ్బారావు, ధరణికోట లక్ష్మీనారాయణ, మస్తాన్, చావలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఒంగోలు సబర్బన్: స్థానిక వేనూతల కాటమరాజు స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఒంగోలు నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా యాదవ ప్రొటెక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లెబోయిన రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

11న జాబ్‌మేళా

ఒంగోలు సిటీ: డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ వారి ఆదేశానుసారం స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ ఒంగోలు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలు పాల్గొని డిగ్రీ కనీస అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎన్నార్సీ పరిధిలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ఫైనలియర్ విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాల్ట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



నాంచార్లరెడ్డికి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

కొత్తపట్నం: ఉప్పు కొటారు భూములకు సంబంధించిన కొత్తపట్నం సాల్ట్ సొసైటీ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవమయ్యాయి. పట్టపు ప్రకాశం అధ్యక్షతన ఉప్పు భూముల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సాల్ట్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత కోమట్ల నాంచార్లరెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి కోమట్ల భాగ్యలక్ష్మి, సొసైటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాటారు ఆంజనేయులు, కార్యదర్శిగా పట్టపు సునీల్, డైరెక్టర్లుగా బి.వెంకట్రావు, వి.యానాది, కోమట్ల భాగ్యలక్ష్మి, కోడూరి బ్రహ్మరెడ్డి, తంబి సురేష్, పట్టపు సురేష్, తంబి శ్రీను, తంబి వెంకటసుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కోసం ప్రతి రైతూ సహకరించాలన్నారు. రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేయటానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సొసైటీకి సంబంధించిన ఉప్పు బిల్లును కూడా రన్నింగ్‌లోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు 60 బ్యాగ్‌ల ఉప్పును విరాళంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పురిణి వెంకటేశ్వర్లు, పట్టపు ప్రభాకర్‌రావు, పురిణి వెంకట్రావు, పట్టపు భూషణం, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు

గుర్తింపు కార్డులు



ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం నుంచి అవసరమైన సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. వినికిడి సమస్య ఉన్న ఒక మహిళకు సహాయపడేలా హియరింగ్ మిషన్‌ను కూడా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొన్నారు.